## రైతులకు అధిక దిగుబడి సాధించడం పట్ల అవగాహన

అగళి, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధజంచడం పట్ల రైతులకు ఏఓ శేఖర్‌నాయక్ అవగాహన కల్పించారు. హెచ్‌డి హళ్లిలో పొలంబడి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి రైతులకు అవగాహన కల్పించారు. శత్రు, మిత్రు పరుగులను గురించి రైతులకు వివరించారు. శత్రు పురుగులు నాశనానికి మిత్ర పురుగులను ఎలా సంరక్షించుకోవాలో వివరించారు. తక్కువ నీటితో అధిక దిగుబడి సాధన, చీడ పురుగులనివారణ, ఎలాంటి భూమిలో ఎలాంటి పంటలు సాగు చేయాలి, రైతు భాగు కోసం ఎలాంటి చర్యలు తీసుకుంటున్నామో వ్యవసాయ శాఖ వివరించింది. ఈ కార్యక్రమంలో రైతులతోపాటు వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్డిటి ఏఎఫ్ ఎకాలజీ ఆధ్వర్యంలో కర్బనమధనం కార్యక్రమం



విత్తనాలను పంపిణీ చేస్తున జగదాంబ కిష్టప్ప

గుడిబండ, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త

గుడిబండ మండల పరిధిలోని మద్దన కుంట, కురుబరపల్లి, కెకె పాళ్యం ముత్తు కూరు గ్రామాలలోని రైతులకు ఆర్డిటి ఏఎఫ్ ఎకాలజీ ఆధ్వర్యంలో కర్బన మదనం కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. యాక్షన్ ఫ్రెటర్నా డైరెక్టర్ డాక్టర్ వైవి.మల్లారెడ్డి ఆదేశాల మేరకు రైతులకు ఉచితంగా విత్తనాలు పంపిణీ చే యడం జరిగిందని ఫీల్డ్ సూపర్‌వైజర్ రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..2018 సంవత్సరం నుంచి నాటిన మామిడి చింత, నేరేడు, జామ, సపోటా, ఉసిరి, చీనాపండ్ల మొక్కలు నాటిన రైతులకు ఆర్డిటి ఏఎఫ్ ఎకాలజీ, రాబోబ్యాంక్ నెదర్లాండ్ వారు సంయుక్తంగా 20 సంవత్సరాల వరకు ఆగ్రో ఫారెస్టు కలిగిన రైతులకు అదనపు ఆదాయాన్ని అందిస్తారని వివరించారు. ఈ బార్డర్ క్రాప్ట్ వేసుకోవడానికి ఏఎఫ్ ఎకాలజీ సంస్థ ద్వారాఉఇచతంగా మహాగవి, ఎర్రచందనం, టేకు, శ్రీగంధం, అవిశ, మద్ది, మలబార్, వేప వంటి విత్తనాలను ఉచితంగా ఆన్ బోర్డ్ అయిన రైతులకు పంపిణీ చేశామని రమేష్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ జగదాంబ కిష్టప్ప, ఫీల్డ్ సూపర్‌వైజర్ రమేష్, కౌన్సిల్ మెంబర్ కిష్టప్ప, శివకుమార్, పుట్టరాజు, ఉమేష్ తదితర రైతులు పాల్గొన్నారు.

## గుత్తిలో నేడు ప్రత్యేక స్పందన

గుత్తి, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త

గుత్తి పట్టణంలోని నిజామీ షాదీఖానాలో శుక్రవారం జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి ఆధ్వర్యంలో ప్రత్యేక స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ మహబూబ్‌బాష తెలిపారు. అన్ని శాఖలకు సంబంధించి జిల్లా స్థాయి అధికారులు ఈ కార్యక్రమానికి హాజరవుతారన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని తమ సమస్యలు పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు.

## ఆ నలుగురు సేవాసమితి ఆధ్వర్యంలో ఆర్థికసాయం

గుంతకల్లు టౌన్, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త



వీరేష్‌కు ఆర్థిక సాయం అందచేస్తున్న దృశ్యం

పట్టణంలోని బాబుజగ్జీవన్‌రామ్ కాలనీలో నివాసం వుంటున్న చిన్నవీరేష్‌కు ఆ నలుగురు సేవాసమితి ఆధ్వర్యంలో ఆర్థికసాయం చేసి మానవత్వం చాటుకున్నారు. టైలర్ వృత్తి చేస్తూ జీవనం సాగిస్తున్న వీరేష్ గుండెకు సంబంధించిన వ్యాధితో బాధపడుతున్న విషయం తెలుసుకున్న సమితి సభ్యులు గురువారం వారి ఇంటి కి వెళ్లి 10 వేల రూపాయల ఆర్థిక సాయం అందచేశారు. ఈ సందర్భంగా సమితి సభ్యులకు వీరేష్ కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ నలుగురు సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షులు మంజుల వెంకటేష్, సభ్యులు చక్రపాణి, కేశవ, తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్ఆర్‌టిఎఫ్ పుట్టపర్తి మండల నూతన కార్యవర్గం ఎంపిక

పుట్టపర్తిరూరల్, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త

పుట్టపర్తి మండల వైఎస్ఆర్‌టిఎఫ్ నూతన కార్యవర్గంను జిల్లా ప్రధాన కార్యదర్శి పి.వి. రమణారెడ్డి ఆధ్వర్యంలో ఏకగ్రీవంగాఎన్నుకుట్లు ఆ సంఘం నాయకులు తెలియజేశారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో ముందుండి, ప్రభుత్వ ప్రవేశపెట్టే వినూత్న కార్యక్రమాలను, విద్యావ్యవస్థ అభివృద్ధికి, విద్యార్థులకు అందే విధంగాకృషి చేయాలని కోరారు. కమిటీ గౌరవాధ్యక్షులుగా పి.సుధాకరణి, అధ్యక్షులుగా ఎం సుబ్బారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కె.సుజాత, కోశాధికారిగా ఓ.సునీత, ఉపాధ్యక్షులుగా డి.శంకరనాయక్, డి.సాయిలీల, డి.రవీంద్రారెడ్డి, జి.శంకర, కార్యదర్శులుగా కె.రామ్మోహన్ రెడ్డి, శ్రీధర్, సి.రజిత, వై.సురేష్, జిల్లా కౌన్సిలర్లుగా ఆర్.పద్రాకర్ రెడ్డి, ఎం.రాజగోపాల్, ఎం.చంద్రకళ, పి.శమంతకమణిలను ఎన్నుకున్నట్లు తెలియజేశారు.

## ప్రతి విద్యార్థి హిందీ భాషా నేర్చుకోవాలి



హిందీ భాషా దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ధర్మవరం రూరల్,సెప్టెంబర్ 14, ప్రభాతవార్త:

ప్రతి విద్యార్థి హిందీ భాషా నేర్చుకోవాలని హిదీ మాస్టర్ శర్మాస్ వలీ పేర్కొన్నారు.గురువారం జాతీయ హిందీ భాషా దినోత్సవం శ్రీ సత్యకృపా మహిళీ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన సభకు ఆయన ముఖ్యఅతిధిగా విచ్చేశారు.ఈ సందర్భంగా శర్మాస్ మాట్లాడుతూ నేటి హిదీ భాషా ప్రపంచ వ్యాప్తంగా ఎంతో గుర్తింపు పొందిందని,హిందీ భాషాను జాతీయ భాషాగా 1949 సెప్టెంబర్ 14న గుర్తించడం జరిగిందన్నారు.ప్రతి విద్యార్థి హిందీ నేర్చుకోవాలని,ఈ హిందీ భాషా దేశంలో ఏక్కడైనా ఒక జీవిత గమ్యంను చేర్చుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ పెద్దిరెడ్డి,ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉరుసు ఉత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

- దర్గా అభివృద్ధికు రూ.లక్ష విరాళం కమిటీకు అందజేత - అమ్మవారికి చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు



దర్గా అభివృద్ధికి రూ.లక్ష విరాళం అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి



ఉరుసు సందర్భంగా బీబీ జైనబ్బీ అమ్మవారికి సమర్పించడానికి ఊరేగింపుగా చాదర్ తీసుకువస్తున్న మాజీ ఎమ్మెల్యే

ఉరవకొండ, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త



దర్గాలో ప్రార్థనల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

హిందూ ముస్లింలు సమైఖ్యంగా జరుపుకునే ఉరవకొండ పట్టణంలోని ప్రసిద్ధ బీబీ జైనబ్బీ అమ్మవారి ఉరుసు మహోత్సవం గురువారం రాత్రి వైభవంగా జరుగగా మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి దర్శించుకున్నారు. ఆయన స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నుండి అమ్మవారి సమాధిపై కప్పేందుకు చాదర్‌తో డప్పు వాయిద్యాల నడుమ భారీ ఊరేగింపుగా దర్గాకు చేరుకోగా దర్గా కమిటీ ఘన స్వాగతం పలికింది. అమ్మవారి సమాధిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే చాదర్ సమర్పించి పూలమాలవేసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా వై.విశ్వేశ్వరరెడ్డి దర్గా అభివృద్ధి కోసం లక్ష రూపాయల విరాళాన్ని దర్గా కమిటీకు అందజేశారు. దర్గా కమిటీ ఆయనకు షాలువాకప్పి పూలమాలతో ఘనంగా సన్మానించింది. ఈ కార్యక్రమంలో వీరశైవ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు దండిన శివానంద, జెడ్పీటీసీ ఏ.సి.పార్వతమ్మ, మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ బోయ సుశీలమ్మ, వైస్ ఎంపీపీ యం.నరసింహులు, పీఏసీఎస్ ఛైర్మెన్ వడ్ల షేక్షావలి, మండల కో ఆప్షన్ సభ్యుడు పామిడి సలీమ్, వక్ఫ్‌బోర్డు జిల్లా సభ్యుడు మీరాన్‌బాషా, వైసీపీ పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు యం.బసవరాజు, మాజీ జెడ్పీటీసీ ఎస్.తిప్పయ్య, మాజీ ఎంపీపీ ఏ.సి.ఎర్రిస్వామి, వైసీపీ జేసీఎస్ కన్వీనర్ బి.ఆసీఫ్, దర్గా కమిటీ అధ్యక్షులు హోతూరు బాషా కమిటీ ఇతర బాధ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## నూతన పించన్లు పంపిణీ



నూతన పంపిచన్లను పంపిణీ చేస్తున్న గోవర్ధన్ రెడ్డి



పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంపిపి శ్రీధర్‌రెడ్డి

బుక్కపట్నం రూరల్, అక్టోబర్ 14, ప్రభాతవార్త

మండల కేంద్రమైన బుక్కపట్నం నందు నూతనంగా మంజూరైన 37 పింఛన్లను లబ్ధిదారులకు వైఎస్ఆర్‌సిపి నాయకులు గోవర్ధన్ రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతంలో లాగా కార్యాలయాల చుట్టూ కాళ్ళరిగేలా తిరిగకుండా వాలంటీర్లు లబ్ధిదారులు గడప దాటకుండానే సేవలు అందిస్తున్నారని అభినందించారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి ఎన్నో సంక్షేమవ పథకాలను ప్రజలకు అందిస్తూ తండ్రికి తగ్గ తనయుడిగా తాను చెప్పిన హామీల కంటే ఎక్కువగా మరెన్నో పథకాలను అమలు చేస్తూ ప్రజలకు సేవలు అందిస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి నియోజకవర్గ వ్యాప్తంగా 25 వేల గృహాలను మంజూరు చేసి చరిత్ర సృష్టించారని, గత ప్రభుత్వం 5 సంవత్సరాలకు గాను బుచ్చయ్యగారిపల్లిలో ఆరు ఇళ్ళు మంజూరు చేస్తే మన ప్రభుత్వంలో అదే పంచాయతీ నందు 246 గృహాలు పేదలకు అందించి కడుతున్నట్లు తెలియజేశారు. నేరం చేసిన వారిని పోలీసులు అరెస్ట్ చేయడం సాధారణమని, దీనిపై ప్రభుత్వాన్ని నిందించడం సరికాదని చంద్రబాబు అరెస్ట్ విషయమై వివరించారు.

**గసికవారిపల్లిలో...**మండల పరిధిలోని గసికవారిపల్లి నందు నూతనంగా మంజూరైన పింఛన్లను ఎంపిపి శ్రీధర్ రెడ్డి, సర్పంచ్ ఎం.గోవింద రెడ్డిల చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు తమకు పింఛన్లు మంజూరు చేసిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి, అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం వారు ఎంపిపి స్కూల్ నందు జగనన్న గోరుముద్ద, రాగిజావ పంపిణీ కార్యక్రమన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ కె.జయచంద్రరెడ్డి, ఎం.నరేష్, ఉపసర్పంచ్ వీరప్ప, వైఎస్ఆర్‌సిపి నాయకులు చింతల్ రెడ్డి, హరినాథ్ రెడ్డి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రయివేట్ బస్సును ఢీకొన్న కేఎస్ ఆర్టీసీ బస్సు.....

- ఫల్టీ కొట్టడంతో 20 మందికి గాయాలు - బళ్లారి-మోకా రోడ్డులో ఘటన - తప్పిన పెను ప్రమాదం



బళ్లారి-మోకా రోడ్డులో ప్రయివేట్ బస్సును ఢీకొని అదుపు తప్పి ఫల్టీ కొట్టి పడిపోయిన కేఎస్ ఆర్‌టీసీ బస్సు

బళ్లారి, సెప్టెంబర్14, ప్రభాతవార్త ;

బళ్లారి-మోకా రోడ్డులో ఓ ప్రయివేట్ బస్సును వెనకటి నుంచి అదే మార్గంలో వెనకవైపు వస్తున్న బళ్లారి డిపోకు చెందిన కేఎస్ ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో అదుపు తప్పి రోడ్డుపై నుంచి ఫల్టీ కొట్టి పొలంలోకి వెల్లకిలా పడిపోయిన ఘటన గురువారం సాయంత్రం 6;30 గంటలకు జరిగింది. ఈ ఘటనలో బస్సులో ప్రయాణిస్తున్న సుమారు 20 మంది గాయపడగా, ఘటనా సమాచారం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన ప్రయాణికుల్ని మోకా ఆస్పత్రికి తరలించారు. బళ్లారి నుంచి ఆదోనికి వెళ్తున్న మీనాక్షి ట్రావెల్ బస్సును బళ్లారి నుంచి తాలూకాలోని హడ్లిగికి వెళ్తున్న బళ్లారిడిపో కేఎస్ ఆర్టీసీబస్సు ఒకదాని కొకటి వెళ్తుండగా ప్రయివేట్ బస్సుడ్రైవర్ రోడ్డుపై ఎద్దులబండి రావడంతో సడన్‌గా బ్రేక్ వేశాడు. వెనకనే వస్తున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్ ఇది గమనించి బ్రేక్ వేయకపోవడంతో బస్సు కాస్త ముందు వెళ్తున్న మీనాక్షి ట్రావెల్ బస్సును గుద్దడంతో డ్రైవర్ అదుపు తప్పిన బస్సు రోడ్డు పై నుంచి ఫల్టీ కొట్టి పొలంలో బోల్తా పడింది. దీంతో బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికులు హాహాకారాలు చేస్తూ రక్షించండంటూ ఆర్తనాదాలు చేశారు. పొలాల్లో పనిచేస్తున్న రైతులు, అటుగా మార్గంలో వెళ్తున్న ఇతర వాహనాల ప్రజలు బస్సులో ఉన్న వారందరినీ రక్షించి రోడ్డుపైకి తరలించారు. ఈలోగా అక్కడికిచేరుకున్న పోలీసులు అంబులెన్స్‌వాహనాలను తెప్పించి క్షతగాత్రుల్ని మోకా ఆస్పత్రికి తరలించారు. పెద్ద ప్రమాదం తప్పడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. డ్రైవర్ అజాగ్రత్త వల్లే ఈ ప్రమాదం జరిగిందని మోకా పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నారు.

## బళ్లారి, విజయనగర జిల్లాల్లో అన్ని తాలూకాలు కరవుపీడిత ప్రాంతాలుగా గుర్తింపు




బళ్లారి, విజయనగర జిల్లాల, తాలూకాల నక్షా

బళ్లారి, సెప్టెంబర్14, ప్రభాతవార్త ;

ముఖ్యమంత్రి సిద్ధరామయ్య బుధవారం ప్రకటించిన రాష్ట్రం లోని కరవుపీడిత తాలూకాల జాబితాల్లో బళ్లారి, విజయనగర జిల్లాల్లోని మొత్తం 11 తాలూ కాలు కరవు పీడిత ప్రాంతాలుగా ప్రకటించారు. దీంతో కరవు పీడిత ప్రాంతాల్లో ప్రజలకు, పశు పక్షాదులకు ప్రత్యామ్నాయ ఉపాధి కార్యకలాపాలు, పశు పక్షాదులకు పశుగ్రాసం పంపిణీ, తాగునీటి సమస్య నివారణ, వర్షాభావం కారణంగా ఎండిపో యిన పంటలకు పరిహారం గుర్తించే కార్యాన్ని రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులు చేపడతారు. ఈ దిశలో జిల్లా యంత్రాంగం ఇప్పటికే కార్యాచరణ ప్రారంభించింది. బళ్లారి తాలూకాలో వర్షాధారంపై వేసుకున్న పంటలు ఇప్పటికే చేతికిరాకుండా పోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తుంగభద్ర హెచ్ఎల్‌సీ, ఎల్లెల్సీ కాలువల కింద ఆయకట్టు భూములకు మాత్రమే నీటి సరఫరా జరుగుతుండడంతో ఆయకట్టు భూముల్లో ఇప్పటికే రైతులు వరినాట్లు వేసుకోవడంతో పాటు మిరప, పత్తి లాంటి పంటలు వేసుకున్నారు. బయలు భూముల్లో శనగ, పత్తి, వేరుశనగ, దనియాలు, జొన్న, సజ్జ, సూర్యకాంతి తదితర పంటలు వేసుకోగా, ఆశించిన స్థాయిలో వర్షం రాకపోవడంతో రైతుల పంటలు కంకి దశలోనే గింజలు పట్టకపోవడంతో దాదాపుగా పంటలు ఎండిపోయే స్థితికి చేరుకున్నాయి. త్వరగా తమ పంటలకు పరిహారం అందజేయాలని రైతులు విజ్ఞప్తి చేశారు.

## నేడు ఉద్యోగుల గ్రీవెన్స్

పుట్టపర్తిరూరల్, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త

శ్రీసత్యసాయి జిల్లా కేంద్రమైన పుట్టపర్తి కలెక్టర్ కార్యాలయం నందు శుక్రవారం ఉద్యోగుల గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు గురువారం ఓ ప్రకటనలో తెలియజేశారు. ఈ నెల మూడవ శుక్రవారం అయినందు ఉదయం 10 గంటలకు ఈ గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, రాష్ట్ర ప్రభుత్వ వివిధ శాఖలలో పనిచేస్తున్న ఉద్యోగులు వారికి సంబంధించి ఉద్యోగ సంబంధిత ఇబ్బందులను దరఖాస్తులో పొందు పరచి, తమ సిఎఫ్ఎంఎస్ ఐడి మరియు ఎంప్లాయి గుర్తింపు నెంబరుతో ఎంప్లాయి గ్రీవెన్స్ కార్యక్రమానికి హాజరు కావాలని తెలియజేశారు.

## రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న మాజీ మంత్రి పరిటాల సునీత



మాట్లాడుతున్న పరిటాల సునీత

కనగానపల్లి, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త

మండలకేంద్రంలో గురువారం చంద్రబాబునాయుడు అరెస్టుకు నిరసనగా టిడిపి మండల నాయకులు రిలేనిరాహార దీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ ఈ రిలే నిరాహార దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరిటాల సునీత మాట్లాడుతూ.. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ రాష్ట్ర ప్రయోజనాల కోసం టిడిపికి మద్దతుగా నిలవడం హర్షించ దగ్గ విషయమని అన్నారు. అలాగే చంద్రబాబునాయుడుపై రాజకీయ కక్షతో జైలుకు పంపడం దారుణమని అన్నారు. రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాస్‌రెడ్డి రామగిరిలో స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణలో తనపై అవినీతి ఆరోపణలు చేశారని, ఈ విషయంపై సిఐడి, సిబిఐతో విచారణ జరిపించుకోవచ్చని అన్నారు. తాను ఎక్కడ అవినీతికి పాల్పడలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎంపిటిసి బిల్లే భాస్కర్, టిడిపి నాయకులు రాజు, కృష్ణ, తూముచెర్ల హరి, బాల ఆంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

## విషజ్వరాలపై ప్రజలకు అవగాహన

శ్రీసత్యసాయిజిల్లా (వైద్యం), ఆగస్టు 14, ప్రభాతవార్త

సీజనల్ వ్యాధులు, ఎనిమియా, మాతు శిశు సంరక్ష, విషజ్వరాల నివారణ తదితర అంశాలపై పుట్టపర్తి రూరల్ మండల పరిధిలోని బత్తలపల్లి, పెదపల్లి గ్రామాల్లో వైద్యసిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే ఆయాగ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు సందర్శించి పిల్లలకు ఇచ్చు ఐరన్ మాత్రల ఉపయోగాలు, ఐరన్ లోపం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లలకు,గర్భవతులకు, బాలింతలకు ఇచ్చు పౌష్టికాహారం, వారి ఆరోగ్య విషయాలను వివరించారు. సచివాలయాల పరిధిలో ప్రజలకు అందించే ఆరోగ్య సేవలు, ఆ సంజీవని, వ్యాయామం చేయడం వల్ల శారీరక ఉల్లాసంతో పాటు, మానసిక ఒత్తిడి తగి ఆరోగ్యంగా సంతోషకరమైన జీవనం కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి నగేష్, పిహెచ్ఎన్ లలితకుమారి, ఆరోగ్య పర్యవేక్షకులు చంద్రకళ, ఎంఎల్‌హెచ్‌పి లు రాధ, సత్యమ్మ, ఆరోగ్య కార్యకర్త సుస్మిత, అంగన్‌వాడీ టీచర్లు చెన్నకృష్ణమ్మ, ఆయ అంజినమ్మ, ఆశా కార్యకర్తలు లక్ష్మీదేవి, పద్మావతి, వాణిబాయి తదితరులు పాల్గొన్నారు.

## రైలు కిందపడి వ్యక్తి మృతి



మృతి చెందిన వ్యక్తి

ధర్మవరం రూరల్,సెప్టెంబర్ 14, ప్రభాతవార్త:

పట్టణంలో చైతన్య కాలనీకి చెందిన హరీష్ కుమార్ పింగ్(73) అను వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. మృతుడు స్వస్థలం చత్తీస్ ఘడ్ కాగా పట్టణంలో వీధుల వెంట చెత్త ఏరుకోని ఒంటరిగా జీవనం సాగించే వాడన్నారు.గత కొంత కాలంగా ఆరోగ్యం సరిగా లేకా అనారోగ్యంతో భాదపడుతూ తీవ్ర మనస్తాపం చెంది చైతన్య కాలనీ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకోని చనిపోయాడని స్థానికులు రైల్వే పోలీసులకు తెలిపారు.ఈ ఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నారు.

## శ్రీ కాళికాదేవి సేవా ట్రస్టుచే అన్నదానం



జిల్లా ఆస్పత్రిలో రోగుల తరపున వచ్చిన ప్రజలకు, సిబ్బందికి అన్నదానం చేస్తున్న శ్రీకాళికాదేవి సేవా ట్రస్టు ప్రతినిధులు

బళ్లారి, సెప్టెంబర్14, ప్రభాతవార్త ;

నగరంలోని జిల్లా ఆస్పత్రిలో స్థానిక శ్రీ కాళికాదేవి ట్రస్టు వారు గురువారం అమావాస్య సందర్భంగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు వారిని చూసుకుంటున్న బంధువులకు ఆస్పత్రి సిబ్బందికి, ఇతరులకు ఉచితంగా అన్నదానం చేశారు. తమ ట్రస్టు ఆధ్వర్యంలో ప్రతి అమావాస్యరోజున జిల్లా ఆస్పత్రిలో ఉచితంగా అన్నదానం చేయడం ద్వారా సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ట్రస్టుకు చెందిన ఎం.ఎస్.నవీన్ కుమార్, కె.నరేష్, కిరణ్‌యాదవ్‌లు తెలిపారు. ఈ సందర్భంలో సాయివినయ్, కె.తరుణ్ తదితర పదాధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పార్టీ సంఘటితానికి ఆమ్ ఆద్మి సభ

బళ్లారి, సెప్టెంబర్14, ప్రభాతవార్త ;




ఆమ్ ఆద్మి పార్టీ పదాధికారుల సభలో ప్రసంగిస్తున్న పార్టీ జిల్లాధ్యక్షుడు జె.వి.మంజునాథ్

ఆమ్ ఆద్మి పార్టీ కార్యాలయంలో పార్టీ జిల్లాధ్యక్షుడు జె.వి.మంజునాథ్ నేతృత్వంలో రానున్న లోక్‌సభ ఎన్నికలకు పార్టీ సంఘటితం, సభ్యత్వ నమోదు అభియాన్ లాంటి కార్యక్రమాలు చేపట్టడంతో పాటు బళ్లారి సిటీ, జిల్లావ్యాప్తంగా సార్వజనికుల సమస్యలు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేదిశలో సమస్యలపై చర్చ జరిగినట్లు పార్టీవర్గాలు తెలిపాయి. పార్టీ తాలూకాసమితి, వివిధ విభాగాలకు పదాధికారుల్ని నియమించే విషయమై ఈ సందర్భంలో చర్చ జరిగినట్లు మంజునాథ్ తెలిపారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ముఖ్యమంత్రి చంద్రును బళ్లారికి ఆహ్వానించి ఆయన సమక్షంలో పార్టీ జిల్లా నూతన పదాధికారుల నియామక కార్యక్రమాన్ని చేయనున్నట్లు సభలో తీర్మానించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంలో జిల్లా కార్యదర్శి సయ్యద్‌అమీర్‌ఖాద్రి, మీడియా ఇన్‌చార్జి శేఖర్‌యాదవ్, కార్యకర్తలు సర్దార్, జానకిరామ్, నూర్‌అహ్మద్, మన్సూర్, నాగరాజగౌడ, శ్రీదేవి, లక్ష్మి, నటరాజ్, అయ్యన్నగౌడ, రఘురెడ్డి, మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

06ATP27_06ATP27.qxd 14-09-2023 PM 10:38 Page 1



## మాజీ మంత్రి వెంకటరమణప్ప నాలుకను అదుపులో పెట్టుకుని మాట్లాడండి

### - జెడిఎస్ నాయకులు తీవ్ర ఆగ్రహం



పత్రికా గోష్టిలో మాట్లాడుతున్న జెడిఎస్ నాయకులు

**పావగడ, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త :** మాజీ మంత్రి వెంకటరమణప్ప హోం మంత్రి డా.జి.పరమేశ్వర్ తాలూకాకు వచ్చిన సందర్భంలో మాజీ ప్రధాని దేవేగౌడ్, మాజీ ముఖ్యమంత్రి హెచ్‌డి కుమారస్వామిలపై విమర్శలు చేస్తూ నాలుగు సీట్ల కోసం బిజెపితో భిక్షమెత్తుకొని పొత్తుపెట్టుకున్నట్లు విమర్శించడాన్ని ఖండిస్తూ గురువారం జెడిఎస్ నాయకులు పట్టణంలోని పార్టీ కార్యాలయంలో పత్రికాగోష్టి ఏర్పాటుచేసి మాజీమంత్రి వెంకటరమణప్పపై తీవ్ర ఆగ్రహం వ్యక్తపరిచారు. ఈ పత్రికా గోష్టిలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు తిమ్మారెడ్డి, జిల్లాఅధ్యక్షులు ఆర్‌సిఅంజనప్ప, మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప , తాలూకా అధ్యక్షులు యన్ఎ ఈరణ్ణలు మాట్లాడుతూ.. దేవగౌడ్, కుమారస్వామిల గురించి విమర్శలు చేసే నైతిక హక్కు నీకు లేదని బిక్షం అంటే ఏమిటో నీకే బాగా తెలుసని ఆగ్రహం వ్యక్తంచేశారు. స్వతంత్ర అభ్యర్థిగా గెలిచినప్పుడు బిజెపితో కలిసిఉన్నప్పుడు ఎంతబిక్షం తీసుకున్నావో, యద్యూరప్ప ప్రభుత్వాన్ని కూల్చి వేసి కుమారస్వామితో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేటప్పుడు ఎంత బిక్షం తీసుకున్నావో నీకే బాగా తెలుసని బిక్షం అనే పదానికి నీకు తప్ప మరెవరికీ తెలియదని ఎద్దేవా చేశారు. ఈ విషయం ప్రజలకు చెప్పాలని కోరారు. లోక్ సభ ఎన్నికల్లో ఎవరితో పెట్టుకుంటే మీకేమని ప్రశ్నించారు. బిజెపితో జెడిఎస్ పార్టీ పొత్తుపెట్టుకుంటే ఓడిపోతామన్న భయం ఇప్పుడే పుట్టుకొచ్చిందా అని ప్రశ్నించారు. ఇంకోసారి మా నాయకుల గురించి విమర్శలు చేస్తే ఊరుకోమని హెచ్చరించారు. బిక్షం అనే పదాన్ని వెనక్కి తీసుకుని నీ పెద్దరికాన్ని కాపాడకోవాలని హితవు పలికారు. ఈ సందర్భంగా జెడిఎస్ పార్టీ తాలూకా గౌరవాధ్యక్షులు రాజశేఖర్, కార్యధ్యక్షుడు గోవిందబాబు, మహాప్రధాన కార్యదర్శిసొగడు వెంకటేష్; నల్లాని సురేంద్ర, గంగాధర్‌నాయుడు, శ్రీరామసేన రామాంజినప్ప, నల్లప్ప, గడ్డం తిమ్మరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఒక్కసారి మా హాస్టల్‌ను సందర్శించి సమస్యలు తీర్చండి కలెక్టర్ సారూ..

### - వేడుకుంటున్న విద్యార్థులు




**మడకశిర టౌన్, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త :** పేద విద్యార్థుల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంక్షేమ హాస్టల్‌లో స్థానిక సంక్షేమ శాఖ అధికారులు ఎలాంటి సౌకర్యాలుకల్పిస్తున్నారు అన్నది తె లుసుకోవడానికి ఒక్కసారైనా మా హాస్టల్‌ను మీరు సందర్శించి మా సమస్యలు గోడు పట్టించుకోరా అంటూ మడకశిరలోని ఎస్సీ, బిసి కళాశాల హాస్టల్ విద్యార్థులు కోరుతున్నారు. మడకశిర పట్టణంలోని బాలికల కళాశాల హాస్టల్‌లో బాలికల విద్యార్థులకు గదుల కొరత తీర్చాలని విద్యార్థులు కోరుతున్నారు. గత రెండు నెలల నుంచి మడకశిర పట్టణంలోని ఎస్సీ, బిసి హాస్టల్‌లో దాదాపు 100 మందికిపైగా ఇంటర్, డిగ్రీ మహిళవిద్యార్థులు ఐదుమండలాలకు చెందినవారు కళాశాలలకు మడకశిరలో చేరడం జరిగింది. ప్రతి రోజు గ్రామాలకు వెళ్లి రావాలంటే సరైన రవాణా సౌకర్యం లేకపోవడం, దానికి తోడు కళాశాలలో ఉదయం నుంచి సాయంత్రం వరకు జరుగుతుండడంతో ప్రతి రోజు గ్రామం నుండి కళాశాలకు వచ్చి పోవాలంటే ఇబ్బందులు పడాల్సి వస్తుందని భావించి విద్యార ఉథలు స్థానిక హాస్టళ్లలో దరఖాస్తు చేసుకుంటే సీట్లు మాత్రం ఇచ్చారు. కానీ విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు మాత్రం కల్పించడం లేదని మహిళావిద్యార్థుల ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. పైరెండు హాస్టళ్లలోనూ మహిళా విద్యార్థులకు గదుల కొరత, కారణంగా ఒక్కొక్క గదిలో పది నుంచి 15 మంది విద్యార్థులు చొప్పున ఉండవలసిన పరిస్థితి ఏర్పడిందని తమకు చెందిన దుస్తులుసైతం ఉంచుకోవడానికి ఇబ్బందులు కలుగుతున్నాయని ఈ విషయంపై స్థానిక హాస్టల్ వార్డెన్లకు తెలియజేసి తమకు గదుల కొరత తీర్చాలని గత రెండు నెలలనుంచి చెబుతున్నప్పటికీ ఏమాత్రం పట్టించుకోవడం లేదని దీంతో తాము ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా హాస్టల్‌లో విద్యార్థుల సంఖ్య అధికమైతే ఎక్కడైనా బయట అద్దెగదులు తీసుకుఒని విద్యార్థులకు ఉంచవలసిన అవసరం కూడా ఉన్నప్పటికీ స్థానిక సంక్షేమ శాఖ అధికారులు మాత్రం అలాంటి చర్యలు తీసుకోకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తు హాస్టల్ నుంచి బయటికి పంపించడానికి చూస్తున్నారని పలువురు విద్యార్థులు పేర్కొన్నారు. కావున ఈ విషయంలో ఇప్పటికైనా జిల్లా ఎస్సీ, బిసి సంక్షేమ శాఖ అధికారులు, డిప్యూటీ డైరెక్టర్లు జిల్లా కలెక్టర్ ఒకసారి మడకశిరలో మహిళా హాస్టల్‌లో సందర్శించి మహిళా విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను గమనించి తమ సమస్యలు పరిష్కరించాలని విద్యార్థులు కోరుతున్నారు.

## చదవుతోపాటు క్రీడల్లోనూ రాణిస్తే ఉన్నత శిఖరాలకు ఎదగొచ్చు..!

### -ఏపీ స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి సుగుణమ్మ, ఎంఈఓ ఈశ్వరప్ప





కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏపీ స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి సుగుణమ్మ

జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న మండల విద్యాధికారి ఈశ్వరప్ప

**ఉరవకొండ, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త :** చదువుతోపాటు క్రీడల్లోనూ రాణిస్తే విద్యార్థులు తమ భవిష్యత్తుకు బంగారు బాట వేసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని ఏపీస్కూల్‌గేమ్స్ జిల్లాకార్యదర్శి సుగుణమ్మ, మండల విద్యాధికారి ఈశ్వరప్ప అన్నారు. పట్టణంలోని కరిబసవస్వామి ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో గురువారం ఏపీ స్కూల్ గేమ్స్ నియోజకవర్గస్థాయి క్రీడాపోటీలు, ఎంపికలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు బాలికలకుపోటీలు జరుగగా స్థానికపాఠశాలప్రధానోపాధ్యాయులు యు.వీరన్న అధ్యక్షతన జరిగిన పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి వారితోపాటు వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు అక్కులప్ప, కార్యదర్శి శ్రీనివాసులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఓటమికి కుంగిపోకుండా గెలుపుకు పొగి పోకుండా ముందుకు సాగాలని సూచించారు. ఒక్క ప్రయత్నంలోనే ఏదీ సాధించడం కుదరదని విజయంకోసం మనంఅలుపెరుగని ప్రయత్నం చేసూనేఉండాలని పిలుపునిచ్చారు. పోటీల ప్రారంభోత్సవానికి ముందు ఎంఈఓ ఈశ్వరప్ప జాతీయ పతాకాన్ని ఎగురవేయగా, ఏపీ స్కూల్ గేమ్స్ కార్యదర్శి సుగుణమ్మ కబడ్డీ ఆడి పోటీలను ప్రారంభించారు. బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రోబాల్, షటిల్ బాట్మింటన్, టెన్నికాయిట్, బాల్ బాట్మింటన్, యోగ, అదజ్లెటిక్స్ పోటీలు, ఎంపికలు కొనసాగాయి. ఈ కార్యక్రమంలో ఏపీ స్కూల్ గేమ్స్ మండల కో ఆర్డినేటర్లు చంద్రశేఖర్, ఆయుబ్, జెడ్పీ సెంట్రల్ హైస్కూల్ పీపీ మారుతీప్రసాద్, ఇతర పీఈటీలు పాల్గొన్నారు.



ఆసక్తికరంగా కొనసాగుతున్న కబడ్డీ పోటీలు

## కన్నుల పండువగా బీబీ జైనబ్బీ అమ్మవారి 'ఉరుసు' ఉత్సవం

### -అర్ధరాత్రి షంషేర్ ఊరేగింపు, పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులు

### -కొనసాగిన ఖవ్వాలి పోటీలు, నేడు జియారత్ మహోత్సవం

**ఉరవకొండ, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త :** పట్టణంలోని హజరత్ బీబీ జైనబ్బీ రహంతుల్లా అలైహా వారి ఉరుసు మహోత్సవం గురువారం కన్నుల పండువగా జరిగింది. ఈనెల 13వ తేదీ నుండి ప్రారంభమైన



దర్గాలో అమ్మవారి జీవసమాధికు పూజలు నిర్వహించిన దృశ్యం



అమ్మవారిని దర్శించుకోవడానికి ఎగబడుతున్న భక్తులు

ఉత్సవాల్లో భాగంగా అర్ధరాత్రి 12 గంటలు దాటిన తరువాత పామిడి బాషసాబ్ అంగడి నుండి షంషేరు శుభ్రపరిచి రాయదుర్గం బుడెన్‌సాబ్ ఇంటి నుండి తాషా వాయిద్యాలతో ఊరేగింపుగా దర్గా చేరుకుంది. ఉరుసు సందర్భంగా అమ్మవారి దర్గా ఉదయం నుండి రాత్రి వరకు మతాలకు అతీతంగా హిందూ, ముస్లీం భక్తులు పాల్గొన్నారు. అమ్మవారి సమాధిని దర్శించుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి కోర్కెల గాజులు సమర్పించారు. దర్గా ఆవరణంలో పెద్దఎత్తున గాజులు, ఆటబొమ్మలు, గృహోపకరణాల దుకాణాలు ఏర్పాటయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం జియారత్ కార్యక్రమం జరుగనుండగా మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయం నుండి అనవాయితీ ప్రకారం చాదర్‌ను ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారి సమాధిపై కప్పి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు. రాత్రి 1 గంటకు దర్గాలో అమ్మవారి జియారత్ ఫాతెహా జరిపి భక్తులకు ప్రసాదం పంపిణీ చేయనున్నారు. ఉరుసు కార్యక్రమంలో దర్గా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొనగా ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అప్‌గ్రేడ్ స్టేషన్ సీఐ వి.హరినాథ్, ఎస్ఐ టి.పి.వెంకటస్వామి సిబ్బందితో గట్టి బందోబస్తు నిర్వహించారు.

## ఎన్నికలు ఎప్పుడొచ్చినా గెలుపు వైసీపీదే..!

### -నేరం చేశాడు కాబట్టే చంద్రబాబు జైలుకెళ్లాడు

### -ఉనికిని కాపాడుకోవడానికే ప్రతిపక్ష పార్టీల ఆరాటం

### -ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి



విలేఖరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

**ఉరవకొండ, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త :** ఎన్నికలు ఎప్పుడొచ్చినా రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీదే గెలుపని వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి మరోమారు ముఖ్యమంత్రి కావడం ఖాయమని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. మండల పరిధిలోని రాకెట్ల గ్రామంలో గురువారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఆయన విలేఖరులతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల పట్ల ప్రజలు సంతోషంగా ఉన్నారని రాష్ట్రంలో వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డికు ఎదురు లేదన్నారు. ప్రజలు సంక్షేమ, అభివృద్ధి ఫలాలు పొందడానికి కార్యాలయాల చుట్టూ ప్రదీక్షిణలు చేస్తూ ఇబ్బందులు పడే పరిస్థితులు నేడు లేవని పారదర్శకంగా అన్నింటినీ ఇంటికే అందించే సచివాలయ, వాలంటరీ వ్యవస్థలను జగన్ తీసుకొచ్చారన్నారు. ప్రతిపక్ష పార్టీలు రాష్ట్రంలో కేవలం ఉనికి కోసమే పాకులాడుతున్నాయని ఎద్దేవా చేశారు. అవినీతి, అక్రమాలకు పాల్పడ్డాడు కాబట్టే చంద్రబాబు నేడు జైల్లో ఉన్నాడని ఇందులో కక్షపూరిత కుట్రేమీ లేదన్నారు. చంద్రబాబుకు సొంత పార్టీతోపాటు ప్రజల్లో కూడా ఎలాంటి సానుభూతి లేదని తప్పుచేశాడు కాబట్టే ఆయన జైలుకెళ్లాడని అందరూ నమ్ముతున్నారన్నారు. ఉరవకొండ ఎమ్మెల్యేగా టీడీపీకు చెందిన పయ్యావుల కేశవ్‌ను గెలిపిస్తే నాలుగేళ్ళలో ఆయన ప్రజల గూర్చి పట్టించుకున్న దాఖలాలే లేవని విమర్శించారు. ఎమ్మెల్యేపట్ల సొంత పార్టీ క్యాడర్‌లో కూడా నిరూత్సాహం ఉందని వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు.

## ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాల కోసం 30లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి

### -ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభ్యాసకుల కేంద్ర ప్రిన్సిపాల్ డా॥జి.రామకృష్ణ

**ఉరవకొండ, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త :** డా॥బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో బీఏ, బీకాం, బీఎస్సీ డిగ్రీ కోర్సుల్లో 2023-24 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు జరుగుతున్నాయని అర్హత కల్గిన అభ్యర్థులు ఈనెల 30వ తేదీలోగా ఆన్‌లైన్‌లో డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బిఆర్ఎఒయుఆన్‌లైన్.ఇన్ ద్వారా దరఖాస్తులు సమర్పించి ఫీజులు చెల్లించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభ్యాసకుల సహాయ కేంద్రం ప్రిన్సిపాల్ డా॥జి.రామకృష్ణ తెలిపారు. గురువారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంటర్, పాలిటెక్నిక్, రెండు సంవత్సరాల ఐటీఐ, ఓపెన్ ఇంటర్ పూర్తీ చేసినవారు నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తు చేసిన అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లను కళాశాల సహాయ కేంద్రంలో వెరిఫై చేయించుకొని దరఖాస్తు ఫారమ్ కాపీను, ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ, ఓపెన్ ఇంటర్, 10వ తరగతి మార్కుల జాబితా, కాస్ట్ సర్టిఫికేట్, ఆధార్‌కార్డు కాపీలను సమర్పించాలని సూచించారు. రెండు, మూడవ సంవత్సరం ట్యూషన్ ఫీజును విద్యార్థులు ఈనెల 30వ తేదీలోగా చెల్లించాలన్నారు. ఇతర వివరాలకు సహాయ కేంద్రం లేదా మొబైల్ నంబర్ 73829 29762కు సంప్రదించాలన్నారు

## వికలాంగుల హక్కుల చట్టం పకడ్బందీగా అమలు చేయాలి

### - సమావేశంలో కరిబసవేశ్వర వికలాంగుల మండల సమాఖ్య



వికలాంగుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీటీ గ్రూప్ ఆర్గనైజర్ శ్రీరాములు

**ఉరవకొండ, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త :** వికలాంగుల హక్కుల చట్టం 2016ను పకడ్బందీగా అమలుచేసి విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు కల్పించాలని కరిబసవేశ్వర వికలాంగుల మండల సమాఖ్య అధ్యక్ష కార్యదర్శులు రాము, అంజినయ్య కోరారు. పట్టణంలోని ఆర్డీటీ ఫీల్డు కార్యాలయంలో గురువారం ఆర్డీటీ వికలాంగుల కమ్యూటీ ఆర్గనైజర్ రఫీక్ ఆధ్వర్యంలో గ్రూప్ ఆర్గనైజర్ శ్రీరాములు అధ్యక్షతన సమాఖ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సమాఖ్య అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ మండల సమాఖ్యలో 601 మంది వికలాంగులు సభ్యులుగా ఉన్నారని తాము సభలు, సమావేశాలు నిర్వహించుకోవడానికిగాను ఉరవకొండ పట్టణంలో పంచాయతీకు చెందిన ప్రధాన రహదారికి సమీపంలోని వికలాంగులు రాకపోకలు సాగించడానికి అనువైన స్థలం కేటాయించాలని కోరారు. స్థలం కోసం కొన్ని నెలలుగా రెవిన్యూ అధికారులతోపాటు పంచాయతీ సర్పంచ్, కార్యదర్శులకు విన్నవించడం జరిగిందన్నారు. వికలాంగులకు నెలకు 6వేల రూపాయలు పింఛన్ అందించాలని, ప్రభుత్వం నుండి అన్నిరకాల సదుపాయాలు కల్పించాలని కోరారు. ఆర్డీటీ గ్రూప్ ఆర్గనైజర్ శ్రీరాములు మాట్లాడుతూ మండల సమాఖ్యలో 28 సంఘాలు ఉన్నాయని సభ్యులు గ్రామస్థాయిలో వికలాంగుల హక్కుల పరిరక్షణకోసం నిరంతరం పాకులాడటం అభినందనీయమన్నారు. వికలాంగుల సమస్యల పరిష్కారానికి ఆర్డీటీ సంస్థ ఎప్పుడూ అండా ఉంటుందన్నారు.

## కాంగ్రెస్ కార్యకర్తల కుంటుంబాన్ని పరామర్శించిన మాజి మంత్రి రఘువీరా



పరామర్శిస్తున్న మాజి మంత్రి రఘువీరారెడ్డి

**అమరాపురం,సెప్టెంబర్ 14,ప్రభాతవార్త:** మండల పరిధిలో వలస గ్రామంలోని కాంగ్రెస్ నాయకుడు కేశవమూర్తి అనారోగ్యంతో మృతి చెందడంతో అతని కుటుంబాన్ని మాజి మంత్రి రఘువీరారెడ్డి గురువారం పరామర్శించారు.మడకశిర మాజి ఎమ్మెల్యే సుధాకర్ సమక్షంలో మృతుడి భార్య ద్రాక్షయనితోపాటు కుటుంబసభ్యులను ఓదార్చారు.అధైర్య పడకండని పార్టీ అండడా ఉంటుందన్నారు.అదేవిధంగా సీనియర్ నాయకుడు డీలరన దాసప్ప అనారోగ్యం పాలు కావడంతో అతన్ని కూడా పరామర్శించి యోగక్షేమాలు తెలుసుకున్నారు.అనంతరం స్థానిరంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులను,కార్యకర్తలను పలకరించారు.ఈ కార్యక్రమం నందు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గురుమూర్తి,మాజి ఆలయ కమిటి అధ్యక్షుడు ఎం.నాగరాజు,నిద్రగట్ట శ్రీనివాస్,రామన్న,విశ్వనాథ్, హనుమంతరాయ,మాజి ఎంపిటిసి రంగారెడ్డి,హేమ రాజు,నాగరాజు,ఆలదపల్లి తిప్పేస్వామి,శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు చంద్రబాబు జైలు నుంచి విడుదల కావాలని విశేష పూజలు

**అమరాపురం,సెప్టెంబర్ 14,ప్రభాతవార్త:** మండల పరిధిలోని హేమావతి గ్రామం నందు వెలసిన హెంజేరు సిద్దేశ్వర స్వామి దేవాలయం నందు టీడీపీ అదినేత చంద్రబాబు నాయుడుని అక్రమంగా అరెస్టు చేయడంతో ఆయన త్వరగా విడుదల కావాలని మడకశిర నియోజకవర్గ ఇంచార్జ్ గుండుమల తిప్పేస్వామి ఆదేశాల మేరకు విశేష పూజలను శుక్రవారం ఉదయం 8 గంటలకు నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల అధ్యఓఉడు గణేష్ తెలిపారు.కావున మండలంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు,కార్యకర్తలు,అభిమానులు ప్రతి ఒక్కరూ ఒక టెంకాయను తీసుకువచ్చి పూజా కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన కోరారు.

## కాపరి మరణానికి కారనమైన ముద్దాయి ఆరెస్ట్



విలేకరులతో మాట్లాడుతున్న సిఐ

**అమరాపురం, సెప్టెంబర్ 14,ప్రభాతవార్త:** మండల పరిధిలోని కెంకర గ్రామానికి చెందిన గొర్రెల కాపరి రంగనాథ్ విద్యుత్ షాకుకు గురై మృతి చెందడానికి కారణమై,నిద్ర గట్ట గ్రామానికి చెందిన క్రిష్ణగిరి అనే ముద్దాయిని గురువారం అరెస్టు చేసినట్లు మడకశిర సిఐ సురేష్ బాబు తెలిపారు.స్థానిక ఎస్ఐ వెంకటేశ్వర్లు సమక్షంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నిద్ర గట్ట గ్రామానికి చెందిన మాల క్రిష్ణగిరి తన మల్బరీ తోటకు చుట్టూ కరెంట్ వైర్‌ను అమర్చి విద్యుత్ కనెక్షన్ ఇచ్చి ఎలాంటి మూగజీవాలు వచ్చి సదరు వైర్‌ను తాకిన చనిపోతాయనే ఉద్దేశంతో దొంగ కరెంట్ వాడుకోని దాదాపు 70 మీటర్ల పోడవు జియో విద్యుత్ వైర్‌ను ఏర్పాటు చేశాడు.కెంకెర గ్రామానికి చెందిన రంగనాథ్(45)అనే గొర్రెల కాపరి తన గొర్రెలను మేపుతుండగా అకస్మాత్తుగా ఒక గోర్రె ఆటు వైపు వెళ్లడంతో దాన్ని తోలడానికి వెళ్లగా అక్కడే విద్యుత్ సప్లై ఉన్న జియో వైరు కాలికి తగిలి అక్కడికి అక్కడే మృతి చెందినట్లు సిఐ తెలిపారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుండగా సదరు ముద్దాయిని హేమావతి గ్రామంలోని నిద్రగట్ట సర్కిల్ వద్ద అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరచనున్నట్లు సిఐ తెలిపారు.

## అర్ధాంతరంగా ఆగిన రోడ్డు పనులపై మంత్రికి వినతి



మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న జడ్పిటిసి

**అమరావురం, సెప్టెంబర్ 14,ప్రభాతవార్త:** మండలంలో అర్ధంతరంగా అగిపోయిన రోడ్డు పనులను పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డికి అమరాపురం జడ్పిటీసి స్వారక్క నరసింహమూర్తిలు అనంతపురం నందు వినతి సమర్పించారు.ఈ సందర్భంగా అమరాపురం మండలంలో అతి ముఖ్యంగా అమరాపురం నుండి వీరపసముద్రం రోడ్డు,శివరం నుండి రంగాపురం వెళ్ళే రోడ్డు,అదేశిదంగా అమరాపురం నుండి పులి కుంటకు వెళ్ళే రోడ్డు పనులు అర్థారంగా అగిపోయి కంకర వేసి ఆగిపోయినట్లు దీనివల్ల ప్రజలు నానా ఇబ్బందులకు గురవుతండడంతో పాటు అమరాపురం,వీరుపసముద్రం రోడ్డులో ప్రయానాకుల ప్రాణాలతు కూడా గాలిలో కలశాయని వారు విన్నమించారు.కావున సత్వరమే పూర్తి చేసే విధంగా మంత్రి చోరవ తీసుకోవాలని జడ్పిటిసి విన్నమించారు.దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించి స్పంధిత అధికారులతో మాట్లాడి రోడ్డు పనులు పూర్తి అవ్వడానికి చోరవ తీసుకుంటామన్నారు.

## వివాహిత ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడిన మహిళ (ఫైల్‌ఫోటో)

**గుత్తి, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త :** మండలంలోని అబ్బేదొడ్డి గ్రామానికి చెందిన గీత (30) అనే వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ కలహాల కారణంగా మనస్థాపంతో ఆమె ఈ అఘాయిత్యానికి ఒడిగట్టినట్లు తెలుస్తోంది. మృతురాలికి భర్తతో పాటు 9 నెలల చిన్నారి వుంది. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## విజయసాయిరెడ్డిని కలిసిన గుత్తి వైసిపి నేతలు

**గుత్తి, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త :** పట్టణానికి చెందిన సీనియర్ వైకాపా నేత సివి రంగారెడ్డి ఆధ్వర్యంలో గురువారం వైసిపి ప్రధాన కార్యదర్శి, ఎంపి విజయసాయిరెడ్డిని క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా పార్టీని బలోపేతం చేయాలని, మరో దఫా జగన్‌ను సిఎం చేసేందుకు కష్టించి పనిచేయాలని ఆయన సూచించారు. నియోజకవర్గం స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన వారికి సూచించారు.



విజయసాయిరెడ్డిని కలిసిన వైకాపా నేతలు

## రాకెట్లలో గడప గడపకు మన ప్రభుత్వం

### -పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి



రాకెట్లలో జరిగిన గడప గడపకు మన కార్యక్రమంలో బ్రోచర్లు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

**ఉరవకొండ, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త :** మండల పరిధిలోని రాకెట్ల గ్రామంలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగగా మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి హాజరయ్యారు. ఆయన స్వగ్రామానికి చేరుకోగానే స్థానిక వైసీపీ నాయకులు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. ఆయన స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి గడప గడపకు వెళ్లి వైసీపీ ప్రభుత్వం గడిచిన నాలుగున్నరేళ్లలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించి బ్రోచర్లను పంపిణీ చేసి స్థానిక సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా వివిధ పథకాల లబ్దిదారులతో కలిసి దివంగత సీయం వై.ఎస్.రాజశేఖరరెడ్డి, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ డి.శివమ్మ, ఉప సర్పంచ్ రామిరెడ్డి, ఎంపీడీఓ యం.డి.అమృత్‌రాజ్, జెడ్పీటీసీ ఏ.సి.పార్వతమ్మ, వైస్ ఎంపీపీ యం.నరసింహులు, మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ బోయ సుశీలమ్మ, టౌన్ బ్యాంకు ఉపాధ్యక్షుడు చంగల మహేష్, మాజీ సర్పంచ్ యం.అశోక్‌కుమార్, మాజీ ఎంపీపీ, జెడ్పీటీసీలు ఏ.సి.ఎర్రిస్వామి, ఎస్.తిప్పయ్య, దయ్యాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ భాష హిందీపై పట్టు ఉంటే దేశంలో ఎక్కడైనా ఉద్యోగాలు పొందవచ్చు




హిందీ దివస్ కార్యక్రమంలో మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ డా॥జి.రామకృష్ణ

**ఉరవకొండ, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త :** జాతీయ భాష హిందీపై పట్టు ఉంటే దేశంలోనే ఎక్కడైనా ఉద్యోగాలు పొందడానికి వీలుంటుందని కళాశాల ప్రిన్సిపాల్ డా॥జి.రామకృష్ణ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం కళాశాల హిందీ విభాగం ఆధ్వర్యంలో హిందీ దివస్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా॥జి.రామకృష్ణ మాట్లాడుతూ హిందీ భాష యొక్క ప్రాముఖ్యత, హిందీ నేర్చుకోవడంవల్ల కలిగే ప్రయోజనాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పోటీ పరీక్షల్లో హిందీ స్థానం గుర్చి వివరించారు. హిందీ విభాగాధిపతి జె.క్రిష్ణవేణి మాట్లాడుతూ రాజభాష హిందీ ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎన్.కె.అరుణజ్యోతి, ఇంగ్లీష్, తెలుగు విభాగాధిపతులు నారాయణస్వామి, గోపి, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలు వలసలు వెళ్లకుండా ఉపాధి పనులు కల్పించాలి

### - ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చెన్నరాయుడు



విలేఖరులతో మాట్లాడుతున్న చెన్నరాయుడు

**ఉరవకొండ, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త :** జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న దృష్ట్య వ్యవసాయ కూలీలు వలసలు వెళ్లడానికి సిద్దమవుతున్నారని అధికారులు వెంటనే స్పందించి గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి.యం.చెన్నరాయుడు కోరారు. గురువారం ఆయన ఉరవకొండలో స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ అనంతపురం జిల్లాను కరువు జిల్లాగా ప్రభుత్వం ప్రకటించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో భూమిలేని నిరుపేదలకు కోనేరు రంగారావు కమిటీ సిఫార్సు మేరకు ఒక్కొక్కరికి ఎకరా భూమిని కేటాయించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో అనేక ప్రాంతాల్లో ప్రభుత్వ భూములు ఉన్నాయని వీటన్నింటినీ భూమిలేని నిరుపేదలకు పంపిణీ చేయాలన్నారు. ఉపాధిహామీ కింద 150 రోజులు పనిదినాలు కల్పించాలని ఆయన కోరారు. కాగా బి.యం.చెన్నరాయుడు ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శిగా ఎంపిక కావడంపట్ల సీపీఐ, అనుబంధసంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

## షిరిడి సాయిబాబా ఆలయంలో తెలుగుయువత ప్రత్యేక పూజలు

### - చంద్రబాబునాయుడు త్వరగా బయటకు రావాలని ప్రార్థనలు



షిరిడి సాయిబాబా ఆలయంలో తెలుగుయువత నాయకులు

**ఉరవకొండ, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త :** తెలుగుదేశం పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కడిగిన ముత్యంలా జైలు నుండి బయటకు రావాలని కోరుతూ పట్టణంలోని షిరిడిసాయి బాబా ఆలయంలో గురువారం తెలుగు యువత నాయకులు ప్రత్యేక పూజలు జరిపించి ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ పలు స్కాములచేసి 16 నెలలు జైలులో ఉండొచ్చాడని ఆ మరకను చంద్రబాబు నాయుడికి కూడా అంటించాలన్న దురాచనతో కక్షకట్టి తప్పుడు కేసులు పెట్టించి ఇబ్బందులు పెడుతున్నాడన్నారు. జగన్ ఎన్ని కుతంత్రాలు పన్నినా చంద్రబాబును ఏమీ చేయలేరన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మణి చౌదరి, ఈడిగ వేణుగౌడ్, యం.రామాంజినేయులు, వరప్రసాద్, తాజుద్దీన్, అనీల్, కుమారస్వామి, సుధాకర్, నూర్ సన్నా, లక్ష్మినారాయణ తదితరులుపాల్గొన్నారు.

## పకడ్బంథీగా సర్వే నిర్వహించాలి

### - కమీషనర్ శ్రీనివాసులు

**గుత్తి, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త శ** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష పథకం అమలులో భాగంగా వాలంటీర్లు ఇంటింటా ఆరోగ్య స్థితిపై సర్వే నిర్వహించాలని కమీషర్ శ్రీనివాసులు సూచించారు. స్థానిక కార్యాలయంలో గురువారం హెల్త్ సెక్రటరీలు, వాలంటీర్లతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. వాలంటీర్లు సంబంధిత కార్యక్రమంలో భాగంగా ప్రజల్లో ఆరోగ్యశ్రీ యాప్ పట్ల అవగాహన కల్పించాలన్నారు. ఇంటింటా సర్వే నిర్వహించి హెల్త్ సెక్రటరీలకు సహకరించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు దివ్యాణి, బిందుభార్గవి, ఇమాంహుసేన్, ఆర్ఒ వెంకటరెడ్డి, ఆర్ఐలు సెక్షావలి, రామాంజినేయులు, చంద్ర, తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ కమీషనర్ మాట్లాడుతున్న దృశ్యం

